పరీక్షను అర్థం చేసుకుంటే.. దాదాపు గెలిచినట్టే!

వైఫల్యాలు ఎదురైనపుడు కుంగిపోకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటేనే పురోగతి సాధ్యం! జాతీయ స్థాయిలో జరిగే అత్యున్నత పరీక్షలు రాసే అభ్యర్థులు తాము చేసిన లోపాలు గుర్తించడం, వాటిని సరిదిద్దుకోవడం తప్పనిసరి. తాజా సివిల్ సర్వీస్ పరీక్షల ఫలితాల్లో అఖిలభారత స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది.. తెలంగాణ విద్యార్థిని నూకల ఉమా హారతి! మూస పంథాలో సాగకుండా స్వీయ పరిశీలన చేసుకుని, చొరవతో లోపాలు సరిదిద్దుకుంది. ఐదో ప్రయత్నంలో గెలుపు బావుటా ఎగురవేసింది. విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన తన విజయ ప్రస్థానం గురించి ఆమెతో 'చదువు' ముఖాముఖీ..

సివిల్స్ సాధించాలనే లక్ష్యం ఎప్పుడు ఏర్పరచుకున్నారు?

ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్) పూర్తయ్యాక 2017లో సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్నా

ఇందుకు బలమైన కారణాలు ఏమైనా ఉన్నాయా?

నాన్న వెంకటేశ్వర్లు నారాయణపేట ఎస్పీ. ఆయన కోరిక మేరకు ఐఏఎస్ కావాలని లక్ష్యంగా ముందుకుసాగాను. సివిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడానికి నాన్నే బలమైన కారణం. తమ్ముడు సాయివికాస్ 2020లో యూపీఎస్సీ ఐఈఎస్‌లో 12వ ర్యాంకు సాధించి ముంబయిలోని సీపీడబ్ల్యూడీలో ఉద్యోగంలో చేరాడు. నా పొరపాట్లు సరిదిద్దుకుని, ఇప్పుడు మూడో ర్యాంకు రావటానికి నాన్న, తమ్ముడి సహకారం మరువలేనిది.

ఏ విధంగా సన్నద్ధమయ్యారు?

సివిల్స్ సిలబస్‌పై, ప్రశ్నపత్రాలు ఇస్తున్న విధానంపై సంపూర్ణంగా అవగాహన పెంచుకున్నా. ఇంటర్నెట్‌లో అవసరమైన సమాచారం సేకరించి ప్రణాళికబద్ధంగా సన్నద్ధమయ్యా. రోజుకు 8 గంటలు చదివాను. పరీక్ష అలవోకగా రాసేందుకు ఎంతో సాధన చేశా.

ఆప్షనల్ సబ్జెక్టు ఏమిటి, దాన్ని తీసుకోవడానికి ప్రత్యేక కారణం ఏమైనా ఉందా?

ఆంత్రోపాలజీ నా ఆప్షనల్ సబ్జెక్టు. ఇదివరకు జాగ్రఫీ తీసుకున్నా. కానీ అందులో ఎక్కువ మార్కులు రాలేదు. దీంతో- రిస్క్ అని అందరూ హెచ్చరించినా సరే, ఆంత్రోపాలజీకి మారి ప్రిపేరయ్యాను.

పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఎలా జరిగింది?

టెక్నికల్ ప్రశ్నలతోపాటు.. అంతర్జాతీయ సంబంధాలు, ఉక్రెయిన్ సంక్షోభం, బ్రిక్స్, నాన్ అలైన్‌మెంట్ మూవ్‌మెంట్, ట్రైబల్ డెవలప్‌మెంట్, ఆంత్రోపాలజీ.. అంశాల నుంచి ప్రశ్నలు అడిగారు. నా ప్రొఫైల్‌ను బేస్ చేసుకుని వీటి నుంచే ప్రశ్నలు అడిగారు.

- ఐదేళ్ల నుంచి ఏం చేస్తున్నావని అడిగారు. 'నేను మిస్టేక్స్ చేస్తూ వాటి నుంచి నేర్చుకుంటున్నా'నని (నవ్వుతూ) చెప్పాను.
- ఉక్రెయిన్ సమస్య గురించి నిర్దిష్టంగా అడిగారు. 'ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు రష్యా మీద అరెస్టు వారెంట్ జారీ చేసింది కదా.. ఆ వారెంట్ వల్ల ఇప్పుడు ఏమవుతుంది' అని అడిగారు. రష్యా ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో మెంబరు కాదు కాబట్టి పెద్దగా ప్రభావం ఉండదు. కానీ... దౌత్యపరంగా కొద్దిగా ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంటుందని చెప్పాను.
- 'ట్రైబల్స్ అసలు డెవలప్ అవుతున్నారా?' అని అడిగారు. డెవలప్ అవుతున్న కొన్ని గిరిజన జాతుల గురించి చెప్పి.. కానీ అభివృద్ధి చెందడానికి ఇంకా చాలా ఉందని చెప్పాను.

సివిల్స్ సన్నద్ధతలో ఉపయోగపడే పుస్తకాలు, రిసోర్సెస్, టిప్స్...

సివిల్స్‌కు సన్నద్ధం కావడానికి ఆన్‌లైన్‌లో పుస్తకాలన్నీ ఉచితంగా లభిస్తాయి. దేశ, అంతర్జాతీయ అంశాలు, సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి. వార్తాపత్రికలు చదవడం, ముఖ్య అంశాలను నోట్ చేసుకోవడం మంచిది. ఏదైనా సమాచారం అవసరమనుకుంటే ఇంటర్నెట్‌లో సెర్చ్‌చేయాలి. అవసరమైన అంశాలను ప్రింట్ తీసుకుని సన్నద్ధం కావాలి. ముఖ్యంగా ప్రాక్టీస్ టెస్టు చాలా ముఖ్యం. మనం రాసిన వాటిలో తప్పులను సరిదిద్దుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది.

శిక్షణ ఎంతవరకు ఉపయోగపడుతుంది?

దిల్లీలో ఏడాది పాటు శిక్షణ పొందాను. కొంతవరకు ఈ శిక్షణ ఉపయోగపడినా అక్కడ ఉండటం ఇష్టంలేక ఇంటి పట్టునే ఉంటూ సన్నద్ధమయ్యా.

సివిల్స్ లక్ష్యం ఉన్నవారు ఎలాంటి లక్షణాలు ఏర్పరచుకోవాలి?

అభ్యర్థులు ప్రతి దశలోనూ పరీక్షను అర్థం చేసుకోవాలి. పరీక్షను అర్థం చేసుకుంటే దాదాపు విజయం సాధించినట్లే. పాత ప్రశ్నపత్రాలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. అందుకు శిక్షణ ఒక్కటే కాదు.. ఇంటర్నెట్‌లో అవసరమైన సమాచారం సేకరించాలి. రాసే విధానంపై సాధన చాలా ముఖ్యం. మనం రాసిన ప్రాక్టీస్ టెస్టు పత్రాలను సీనియర్‌లకు పంపించి తప్పిదాలను తెలుసుకుని వాటిని పునరావృతం కానీయకూడదు.

ఒత్తిడిని అధిగమించడానికి మీరు ఏం చేసేవారు?

నాలుగుసార్లు విఫలమయ్యా కదా? దీంతో ఒత్తిడిని అధిగమించడానికి బ్యాడ్మింటన్ ఆడాను. యోగా సాధన చేయడంతోపాటు అప్పుడప్పుడూ సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం, రన్నింగ్, వంటలు వండటం లాంటివి చేశాను. వీటన్నిటితో కొంత వరకు ఒత్తిడిని తగ్గించుకోగలిగాను.

సివిల్స్ ఆశావహులకు మీ సూచనలు?

యువత తమకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. సివిల్స్ ఎంచుకున్నవారు నిరంతర సాధన చేయాలి. పరీక్షకు చాలా పకడ్బందీగా సన్నద్ధం కావాలి. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు ఉంటాయి? వాటికి జవాబు ఎలా రాయాలో అవగాహన పెంచుకోవాలి. పరీక్షను అర్థం చేసుకోవాలి. గతంలో వచ్చిన ప్రశ్నపత్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. ఏది, ఎంత చదవాలో అంతే చదవడం మంచిది. బాగా కష్టపడాలి. పరీక్షలో ఫెయిల్ అయినా నిరాశ చెందవద్దు.

ప్రతి రంగంలోనూ విజయం సాధించిన ప్రతి ఒక్కరి నుంచీ ఏదో ఒక విషయంలో స్ఫూర్తి పొందవచ్చు. ఒకటి రెండు సార్లు విఫలమైనప్పటికీ ఆందోళన పడకూడదు. ఇది వరకు సివిల్స్ సాధించినవారి సహకారం తీసుకుని తప్పులు జరుగకుండా జాగ్రత్తపడాలి. ఆప్షనల్ సబ్జెక్టుల ఎంపికలోనూ జాగ్రత్త తీసుకోవాలి. లేకుంటే అనుకున్నన్ని మార్కులు సాధించలేకపోవచ్చు. ప్రతిరోజు చదవడం, ప్రాక్టీసు చేయడం మంచిది. రోజూ పది గంటలు చదువుకు కేటాయించాలి. వారానికోసారి చదివిన అంశాలను ప్రాక్టీస్ టెస్టు రాయడం అలవాటుచేసుకోవాలి. పరీక్షలో ఎన్నిసార్లు విఫలమైనా ఫెయిల్యూర్‌గా భావించకూడదు. ఇలాంటి సమయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం పొందడం చాలా ముఖ్యం.

గతంలో చేసిన పొరపాట్లు ఏమిటి? వాటినెలా అధిగమించారు?

మొదట్లో సివిల్స్ పరీక్షల తీరును సరిగా అర్థం చేసుకోలేకపోయాను. ఎలాంటి సిలబస్ ఇస్తారో తెలుసుకోలేకపోయా. ఎలా చదవాలో, ఎలా రాయాలో సరిగా తెలియక పరీక్ష సక్రమంగా రాయలేకపోయాను. చిన్నచిన్న పొరపాట్లతో తగిన ర్యాంకు సాధించలేకపోయాను.

నేర్చుకున్నదాన్ని పరీక్షలో రాయటంపైనే గతంలో దృష్టి ఉండేది కానీ మార్కుల కోణంలో ఆలోచించేదాన్ని కాదు. అలాగే రాసే విధానమూ అంత మెరుగ్గా ఉండేది కాదు. గతంలో జరిగిన ఇంటర్వ్యూలో బోర్డు అడిగిన ప్రశ్నలకు వరసగా సమాధానాలు చెప్పుకుంటూ పోయాను.

ఈసారి మాత్రం ఎక్కువ మార్కులు సాధించాలన్న లక్ష్యంతో చదివాను. జవాబులు రాసే విధానం, ఇంటర్వ్యూలో సమాధానాల ప్రజెంటేషన్ మెరుగుపర్చుకున్నాను. వారంలో రెండు ప్రాక్టీస్ టెస్టులు రాసి మిత్రులకు పంపించి పొరపాట్లను సరిదిద్దుకునేదాన్ని. సివిల్స్ పరీక్షపై నా ఆలోచన, దృక్పథం మార్చుకోవడం వల్లనే ఈ విజయం సాధ్యమైంది.

- వి.నరేందర్,
న్యూస్‌టుడే - నారాయణపేట

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

మార్కెటింగ్

సంస్థ: ఏస్టర్ ఇండియా
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: జూన్ 2
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/891ab3

మార్కెట్ రిసెర్చ్

సంస్థ: స్కిల్ వెర్‌టెక్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: జూన్ 2
అర్హతలు: మార్కెట్ రిసెర్చ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/8d978d

హైదరాబాద్‌లో

లా/లీగల్

సంస్థ: జీగ్లర్ ఎయిరోస్పేస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: జూన్ 2
అర్హతలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఇంగ్లిష్ మాట్లాడం, రాయడం, హెచ్‌ఆర్ అనలిటిక్స్, లేబర్ లాస్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b45668

హైదరాబాద్ కొండాపూర్‌లో

టెలిమార్కెటింగ్

సంస్థ: ఎంకి అవెన్యూ అసోసియేట్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జూన్ 2
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/cea325

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)

సంస్థ: జీనీ ఎక్స్‌పోర్ట్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: జూన్ 2
అర్హతలు: ఇంగ్లిష్ రాయడం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/db845a

పది పాసైతే తపాలా కొలువు

నియామక పరీక్ష రాయకుండా, పదో తరగతి మార్కుల ప్రతిభతోనే ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం వచ్చింది! గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ప్రకటన వెలువడింది. దేశవ్యాప్తంగా 12,828 పోస్టులు భర్తీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 118, తెలంగాణలో 96 ఖాళీలు ఉన్నాయి. అవకాశం వచ్చినవారు బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం) హోదాలతో విధులు నిర్వర్తించవచ్చు. పోస్టును బట్టి సుమారు రూ.15,000 నుంచి 20,000 వేతనం పొందవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి!

గతంలో గ్రామీణ డాక్ సేవక్ పోస్టులకు ఎంపికైనవారికి స్థిర వేతనం, ఏటా ఇంక్రిమెంట్ మాత్రమే లభించేవి. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వీరికి మూలవేతనం (బేసిక్ పే)తో పాటు కరవు భత్యం(డియర్‌నెస్ అలవెన్సు)ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 42 శాతం డీఏ అమలవుతోంది.

- దీని ప్రకారం బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం)కు రూ.12,000 మూలవేతనంతోపాటు ఇందులో 42 శాతం అంటే రూ.5040 డీఏ కూడా దక్కుతుంది. అంటే మొదటి నెల నుంచే వీరు రూ.17040 వేతనం అందుకోవచ్చు. దీంతోపాటు ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి. ప్రతి ఆరు నెలలకు ఒక డీఏ, ఏటా ఇంక్రిమెంట్ వేతనంలో కలుస్తుంది.
- అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం)కు రూ.పదివేల మూల వేతనంతోపాటు రూ.4200 డీఏ దక్కుతుంది. వీరు విధుల్లో చేరిన మొదటి నెల నుంచి రూ.14,200 వేతనం, ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చు. వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ఏబీపీఎంలకు ప్రోత్సాహం అందిస్తారు. ఆ సేవల విలువ ప్రకారం ఇన్సెంటివ్ చెల్లిస్తారు. స్వల్పమొత్తంలో హెచ్‌ఆర్ఏ కూడా దక్కుతుంది. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/కంప్యూటర్/స్మార్ట్‌ఫోన్ లాంటివి పోస్టల్ శాఖ సమకూరుస్తుంది. సంబంధిత కార్యాలయానికి అందుబాటులో నివాసం ఉండాలి. సైకిల్ తొక్కడం రావాలి. ఈ పోస్టుల్లో అవకాశం వచ్చినవారు రోజుకు సుమారు నాలుగైదు గంటలు పనిచేస్తే సరిపోతుంది.

విధులిలా..

బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం): వీరు బ్రాంచ్ కార్యకలాపాలు పర్యవేక్షించాలి. పోస్టల్ విధులతోపాటు ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా, ఉత్తరాలు పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలి. పోస్టల్‌కు సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలూ చక్కబెట్టాలి. బృందనాయకుడిగా సంబంధిత బ్రాంచ్‌ను నడిపించాలి. పోస్టల్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం): ఈ విధులు నిర్వర్తించేవాళ్లు స్టాంపులు/స్టేషనరీ అమ్మకం, ఉత్తరాలు పంపిణీ, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, పేమెంట్లు, పోస్టల్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాలు చక్కబెట్టాలి. బ్రాంచ్ పోస్టు మాస్టర్ చెప్పిన పనులు పూర్తిచేయాలి. తపాలా స్కీమ్‌ల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.

ఎంపిక

అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్‌తో నియామకాలుంటాయి. ప్రకటనలో ఖాళీలు ఉన్న బ్రాంచీలు, ఏ హోదాలో ఖాళీ ఉంది, రిజర్వ్‌డ్/అన్ రిజర్వ్‌డ్ వివరాలు పేర్కొన్నారు. వాటిని అభ్యర్థులు పరిశీలించి, తమ ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. మొదటి ప్రాధాన్యం ఇస్తోన్నదానికి ఆప్షన్-1 తర్వాత దానికి ఆప్షన్-2... ఇలా నింపాలి. అవకాశాన్ని బట్టి వీటిలో ఏదో ఒకచోట పోస్టింగ్ కేటాయిస్తారు.

కటాఫ్ అంచనా: గత నియామకాలు పరిశీలిస్తే.. ఏపీ, తెలంగాణల్లో జనరల్, ఓబీసీ విభాగాల్లో సుమారు 95 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 93 శాతం మార్కులు పొందినవారికి అవకాశం దక్కింది. పోస్టుల సంఖ్యను బట్టి కటాఫ్‌లో హెచ్చుతగ్గులుంటాయి.

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అంటే ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదవాలి.

వయసు: జూన్ 11, 2023 నాటికి 18-40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ సడలింపు వర్తిస్తుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 11

వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in/

అవకాశాలు చేజారిపోతున్నాయి...

మూడు ఎంఎన్‌సీ కంపెనీల్లో పనిచేశాను. ఫైనాన్స్, అకౌంట్స్ విభాగంలో మూడున్నరేళ్ల అనుభవం ఉంది. శాప్ ఈఆర్‌పీ, శాప్ ఫికో కోర్సుల్లో శిక్షణ పొందాను. మూడో కంపెనీలో కాంట్రాక్టు పీరియడ్ ముగిశాక ఏడు నెలలుగా ఖాళీగా ఉన్నాను. కొన్ని అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్నాయి. త్వరగా ఉద్యోగం రావాలంటే నేనేం చేయాలి?

- సురేందర్

■ ఉద్యోగానుభవం, శిక్షణ పొందిన కోర్సుల గురించి రాశారు కానీ, మీ విద్యార్హతలు తెలియచేయలేదు. బీటెక్/ బీకామ్/ బీబీఏ/ ఎంకామ్/ ఎంబీఏ చేశారా, సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ కంపెనీ సెక్రటరీ లాంటి కోర్సులు ఏమైనా చదివారా అనే వివరాలు చెప్పలేదు. ఫైనాన్స్/ అకౌంటింగ్ విభాగాల్లో ఏ హోదాలో పనిచేశారో కూడా రాయలేదు. ముందుగా మీరు ఏ రంగంలో, ఎలాంటి ఉద్యోగంలో స్థిరపడాలనుకొంటున్నారో నిర్ణయించుకోండి. అందుకు తగ్గ కోర్సులు, శిక్షణ పొందే ప్రయత్నం చేయండి. అవకాశాలు వచ్చినట్లే వచ్చి చేజారిపోతున్నాయని చెప్పారు. ఏ కారణాలవల్ల ఉద్యోగం రావట్లేదో తెలుసుకొనే ప్రయత్నం చేయండి. విషయ పరిజ్ఞానం తక్కువగా ఉండటం, కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం, మీ గత ఉద్యోగాల్లో చేసిన పని వివరాల గురించి సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోవడం, మూడేళ్లలో మూడు కంపెనీలు మారడం, మీరు ప్రయత్నిస్తున్న ఉద్యోగానికి కావలసిన నైపుణ్యాలు మీ దగ్గర లేవని ఇంటర్వ్యూ చేసేవారు భావించడం, మీ బాడీ లాంగ్వేజ్ సరిగా లేకపోవడం.. వీటిలో ఏయే కారణాలవల్ల మీరు ఉద్యోగాన్ని పొందలేకపోతున్నారో తెలుసుకోండి. ఆ దిశలో మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకొనే ప్రయత్నాలు చేయండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

టీహెచ్‌డీసీ ఇండియాలో 52 ట్రెయినీలు

భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్ 52 ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్.
అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 65 శాతం మార్కులతో బీఈ/ బీటెక్/ ఇంజినీరింగ్/ బీఎస్సీ ఉత్తీర్ణత.
● **గేట్‌లో అర్హత సాధించాలి.**
వయసు: 33 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: గేట్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.600.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.06.2023.
వెబ్‌సైట్: https://thdc.co.in/new-openings

ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో టీచింగ్ పోస్టులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ డిప్యుటేషన్/ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 116 ఫ్యాకల్టీ సభ్యుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. **ప్రొఫెసర్:** 29
2. **అడిషనల్ ప్రొఫెసర్:** 29
3. **అసిస్టెంట్ ప్రొఫెసర్:** 38
4. **అసోసియేట్ ప్రొఫెసర్:** 20

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్స్ తదితరాలు.
విద్యార్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16-06-2023.
వెబ్‌సైట్: https://www.aiimsraipur.edu.in/index.php

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ సెంటర్ రెగ్యులర్ ప్రాతిపదికన 47 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, మేనేజర్ తదితరాలు.
విభాగాలు: సొల్యూషన్ ఆర్కిటెక్ట్ లీడ్, పీఎంవో లీడ్, చీఫ్ మేనేజర్, టెక్ ఆర్కిటెక్ట్, అబ్జర్వబిలిటీ అండ్ మానిటరింగ్ స్పెషలిస్ట్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంసీఏతో పాటు పని అనుభవం.
ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీలకు రూ.750; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తు, రిజిస్ట్రేషన్‌లకు చివరి తేదీ: 05.06.2023.
వెబ్‌సైట్: https://sbi.co.in/web/careers/

ఎన్‌జేవీఎన్ లిమిటెడ్‌లో మేనేజర్లు

భారత ప్రభుత్వం, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలోని ఎన్‌జేవీఎన్ లిమిటెడ్ 51 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: సీనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు.
విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, సీ అండ్ ఐ, కెమికల్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ/ ఎంఎస్సీ.
అనుభవం: 3-14 ఏళ్లు ఉండాలి.
వయసు: 30-45 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.590.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
చిరునామా: O/o DGMs Recruitments, SJVN Limited Shakti Sadan, Corporate Head Quarters, Shanan Shimla, HPn171006.
దరఖాస్తుకు చివరి తేదీ: 12.06.2023.
వెబ్‌సైట్: https://sjvn.nic.in/

100 ప్రాజెక్ట్ ఆఫీసర్, ప్రాజెక్ట్ ఇంజినీర్‌లు

ప్రభుత్వ రంగ సంస్థ- భారత్ డైనమిక్స్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ (కాంట్రాక్ట్) ప్రాతిపదికన హైదరాబాద్, బెంగళూరు, భానూర్, విశాఖపట్నం, కొచ్చి, ముంబయిలోని ఉన్న బీడీఎల్ కార్యాలయాలు/ యూనిట్లలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
● **ప్రాజెక్ట్ ఇంజినీర్ / ప్రాజెక్ట్ ఆఫీసర్: 100 పోస్టులు**
విభాగాలు: హెచ్‌ఆర్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్.
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, పీజీ డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యూఏతో పాటు పని అనుభవం.
వయసు: 10-05-2023 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.300 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు మినహాయించారు).
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు: 23-06-2023.
ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి: 05-07-2023.
ఇంటర్వ్యూ తేదీలు: జులై రెండో వారం.
వెబ్‌సైట్: https://bdl-india.in/

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలు ఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in